కాంగ్రెస్ విజయం ఖాయం



మాట్లాడుతున్న కోట నీలిమ

సనత్‌నగర్: సనత్‌నగర్‌లో కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేయడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి కోట నీలిమ ధీమా వ్యక్తం చేశారు. బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లో సోమవారం జరిగిన నియోజకవర్గ పార్టీ బూత్ ఏజెంట్ల సమావేశంలో నీలిమ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమని రిగ్గింగ్‌కు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, కచ్చితంగా కాంగ్రెస్ విజయం సాధిస్తోందన్నారు.

'కోడ్' ఉల్లంఘనులపై కేసు నమోదు

రాంగోపాల్‌పేట్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి, పద్మారావుగౌడ్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 10.45 గంటల సమయంలో టకారాబస్తీలోని పద్మారావు నివాసం వద్ద సుమారు 150 నుంచి 200 మంది వరకు గుమిగూడి ఉన్నట్లు సమాచారం అందుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి అబ్దుల్ షఫీతో పాటు బృందం, మార్కెట్ పోలీసులు అక్కడికి చేరుకోగా కొంత మంది పార్టీ కండువాలు ధరించి కార్యాలయంలో కూర్చోవడంతో పాటు మరికొంత మంది బయట ఉన్నారు. పోలీసుల రాకతో అందరూ అక్కడి నుంచి పరారయ్యారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా గుమిగూడటంతో పాటు న్యూసెన్స్ సృష్టిస్తుండటంతో పద్మారావుతో పాటు ఆయన కుమారులు కిరణ్‌కుమార్ గౌడ్, కిషోర్ కుమార్ గౌడ్ పద్మారావు అనుచరుడు భువనగిరి కిరణ్‌గౌడ్, ఎం దినేష్, బలదేవ్, మైసయ్యలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సేవకే పట్టం కట్టండి!

అభ్యర్థులతో సాక్షి ముఖాముఖి

మరో మూడు రోజుల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థులు బస్తీ, గల్లీ వదలకుండా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. తాము చేసిన అభివృద్ధి గురించి సిట్టింగ్‌లు, తాము గెలిస్తే చేయాల్సిన పనులపై ప్రజలకు హామీలిస్తూ తమదైన శైలిలో ప్రజలకు చేరువవుతున్నారు. సామాన్యుడి తరపున మీకే ఎందుకు ఓటేయాలని సాక్షి ప్రశ్నించగా వారిచ్చిన సమాధానాలు ఇవి. –సనత్‌నగర్

మరింత అభివృద్ధి చేస్తా — తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి



నియోజకవర్గాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేశా. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించుకుంటూ వచ్చాను. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వస్తున్నా. తాను ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా ప్రజావసరాలను తెలుసుకుని వాటన్నింటినీ సమకూర్చారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటా. అభివృద్ధి విషయంలో నిబద్ధతతో పనిచేస్తాను. పనులను ప్రారంభించడంతోనే పని అయిపోయిందని కాకుండా ఆ పనుల విషయంలో నిత్యం సమీక్షిస్తూ ప్రజల వెతలను తీరుస్తూ వచ్చాను. ఇక మీదట కూడా అదేవిధంగా పని చేస్తాను.

పార్టీలకతీతంగా పథకాలు అందిస్తా — మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి



తాను ఎమ్మెల్యేగా గెలిస్తే పార్టీలకతీతంగా పథకాలు అందేలా చేస్తా.నిత్యం ప్రజా క్షేత్రంలోనే ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తా. అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలు సాధ్యంకాని హామీలను ఇస్తున్నారు. తన రాజకీయ జీవితం మొదలైనప్పటి నుంచి చిన్న అవినీతి మచ్చ లేకుండా ప్రజలకు సేవలందిస్తూ వచ్చాను. అక్రమాలపై ప్రశ్నించే వాడినే గాని అక్రమాలకు తావిచ్చే వాడిని కాను. క్షేత్రస్థాయిలో సుపరిపాలన సాగాలంటే బీజేపీతోనే సాధ్యపడుతుంది. కేంద్రంలో నరేంద్రమోదీ దేశం గర్వించేలా పాలనను అందించారని, రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తే డబుల్ ఇంజన్ సర్కార్‌తో మరింత అభివృద్ధి, సంక్షేమం చేస్తాం.

మహిళా అభ్యున్నతికి కృషిచేస్తా.. — కోట నీలిమ, కాంగ్రెస్ అభ్యర్థి



ఇందిరమ్మ రాజ్యంతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది. మేనిఫెస్టోలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తా. వారు ఆర్థికంగా ఎదిగేలా సంక్షేమ పథకాల అమలు చేస్తా. నియోజకవర్గంలో బస్తీల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే అన్ని సమస్యలను పరిష్కరించి వాటి రూపురేఖలను మారుస్తా. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో ప్రజలకు మేలు జరుగుతుంది. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీ హామీలు అందేలా చేస్తా. అవసరమైన చోట్ల అండర్‌గ్రౌండ్ కేబుళ్ల నిర్మాణం, ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు అవసరమో గుర్తించి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా.

నమూనా ఈవీఎంలతో అవగాహన

లాలాపేట: తార్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు నమూనా ఈవీఎంలతో ప్రజలకు అవగాహన కల్పించారు. లాలాపేట బస్తీల్లో ప్రజల వద్దకు వెళ్లి పోలింగ్ బూత్‌లో ఓటు వేసేటప్పుడు బీప్ శబ్దం ఎలా వస్తుందని అనే విషయాలను నమూనా ఈవీఎం ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట హరి, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, గౌలికార్ మహేశ్, విజయ్, హన్మంత్ యాదవ్, నాగులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్‌తో సంచలనం సృష్టిస్తా

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు



మాట్లాడుతున్న పద్మారావుగౌడ్

చిలకలగూడ : హ్యాట్రిక్ విజయంతో సంచలనం సృష్టించి సికింద్రాబాద్ చరిత్రను తిరగరాస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి డివిజన్ సవరాలబస్తీ, శ్రీనివాసనగర్, ఫ్రైడేమార్కెట్, మార్కండేయనగర్ తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకుడు పొగర్తి భవన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ మాట్లాడారు. సికింద్రాబాద్‌ను అన్నిరంగాల్లోను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉన్నారని, కేవలం ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వచ్చే నాయకులు, పార్టీలకు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు పద్మారావుకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ, నాయకులు పొగర్తి భువన్‌రావు, కరాటే రాజు, బాలాజీ,గరికపోగుల చంద్రశేఖర్, గౌడ్ శ్రీను, కృష్ణగౌడ్, మహాత్మా, విజయ్ పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యం..

బౌద్ధనగర్: మైనారిటీల సంక్షేమానికి గతంలో ఎన్నడూ లేని రీతిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తోందని పద్మారావుగౌడ్ అన్నారు. వారిసిగూడ చౌరస్తాలో జరిగిన నియోజకవర్గ మైనారిటీ సంఘాల సమాశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా వివిధ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలతో మైనారిటీలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కేవలం రాజకీయాలు, ఓట్ల కోసం కాకుండా ప్రజలకు నిరంతరం అండదండగా నిలిచామన్నారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఇంతియాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చుతున్నారని, మైనారిటీల ప్రయోజనాలను పరిరక్షిస్తున్నారని వెల్లడించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే మైనారిటీలకు తగిన గౌరవం లభిస్తోందన్నారు. కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, సునీత, నేతలు కలీం, ముజాఫర్, మస్తాన్, మునావర్ పాల్గొన్నారు.

హ్యాట్రిక్ కోసం మహాయజ్ఞం..

లాలాపేట: సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ హ్యాట్రిక్ సాధించాలని కోరుతూ సోమవారం లాలాపేటలో కార్తీక పౌర్ణమి సందర్భంగా నేతలు వేణుగోపాల్‌రెడ్డి, స్మితాకేటేశ్వర్‌రావు, రజనీకాంత్, రాధా మోహన్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ మహాయజ్ఞం నిర్వహించారు.



సవరాలబస్తీలో పద్మారావును సన్మానిస్తున్న భవన్‌రావు

ప్రజా ఆశీస్సులతో విజయం సాధిస్తా

బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్



చాచానెహ్రునగర్‌లో ప్రచారం చేస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రజా ఆశీస్సులతో రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ ఉప్పలమ్మ దేవాలయం, సీసీనగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ఎన్నికల పాదయాత్ర సందర్భంగా ప్రజల నుంచి విశేషమైన స్పందన, ఆదరణ లభిస్తుందన్నారు. ఎక్కడ చూసినా ప్రజలు తాము చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండటం..సమస్యలపై స్పందించడం చేసిన అభివృద్ధి తన విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పేదలు, మధ్య తరగతి, ఉన్నతవర్గాల ప్రజలు ఈ సారి ప్రచారంలో భారీ ఎత్తున పాల్గొని బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారన్నారు.



గురుద్వారలో జరిగిన ప్రార్థనల్లో తలసాని

రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ ఖాయమన్నారు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు రాజేందర్, కుమార్ యాదవ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తో సాధ్యం..

అమీర్‌పేట: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని సనత్‌నగర్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్‌లోని గంగుబాయి బస్తీ, బౌద్ధనగర్, బల్కంపేట ఈడెన్ అపార్ట్‌మెంట్స్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం వచ్చిన తొమ్మిదన్నర సంవత్సరాల్లో చేశామన్నారు. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి, నేతలు హనుమంత్‌రావు, గులాబ్‌సింగ్, పీయూష్ ప్రేమ్‌గుప్తా, ఎం.లలితగోపీచౌహాన్, సత్యనారాయణ,బాబురావు, సంపత్, నరేష్ పాల్గొన్నారు.

- గురునానక్ జయంతి సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అమీర్‌పేట గురుద్వారను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ



ప్రత్యేక పూజలో చైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిరాదేవి దంపతులు

చిలకలగూడ: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల వద్ద ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం 108 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరాదేవి దంపతులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసనగర్, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, చిలకలగూడ కట్టమైసమ్మ నల్ల పోచమ్మ తదితర ఆలయాల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతిజ్ఞ చేశాం.. తలసానికి మద్దతిస్తాం

సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతిస్తామంటూ బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీ వాసులు ప్రతిజ్ఞ చేశారు. రానున్న ఎన్నికల్లో తలసానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బస్తీ కమిటీ అధ్యక్షులు సుభాష్, యాదగిరి, సత్యనారాయణ, కుషాల్, రాజు, శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రిగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ తమ బస్తీలో చేపట్టి ప్రజాభివృద్ధి కార్యక్రమాలతో పాటు సమస్యల పరిష్కారానికి చేసిన కృషికి ఈ ఎన్నికల్లో ఆయనకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నామన్నారు. ఏసూరి మహేష్, సురేష్, శ్రీకాంత్‌రెడ్డి, తలసాని మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. –పద్మారావునగర్



బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల కోసమే అభివృద్ధి పనులు

సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి



ఓటర్లకు కరపత్రాలు అందజేస్తూ..

సనత్‌నగర్: బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పనులు కేవలం కమీషన్ల కోసమే అన్నట్లుగా మారిందని సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన అల్లావుద్దీన్‌కోఠి, ఎస్ఆర్‌టీ కాలనీ, కైలాష్ నగర్, జెక్‌కాలనీ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల ఆకాంక్షతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ పాలనలో అడుగడుగునా దగాకు గురైందన్నారు. ముస్లిం మైనార్టీలు అధికంగా ఉండే అల్లావుద్దీన్ కోఠిలో ఆయనకు అనూహ్య స్పందన లభించింది. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మర్రి శశిధర్‌రెడ్డికి ప్రజలు హారతులతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, బీజేపీకి అవకాశం ఇచ్చేందుకు సిద్ధమయ్యారన్నారు.ప్రాజెక్టుల పేరిట అవినీతి రాజ్యమేలిందన్నారు. అభివృద్ధి పనులకు అంచనాలను పెంచేసి నిధులను కాంట్రాక్టర్లకు ధారపోశారన్నారు. ఉద్యోగాల కోసం కష్టపడి చదువుకుంటే పేపర్ లీకేజీలకు పాల్పడి వారి భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ విధానాలను రాష్ట్రంలో కూడా అమలుచేసి పకడ్బందీగా నియామకాలను జరుపుతుందన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ సమస్యలపై తనకు అణువణువూ తెలునని, బీజేపీపై విశ్వాసం ఉంచి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

స్వామి థియేటర్ వద్ద ప్రచారం..

అమీర్‌పేట: బీసీలంతా ఏకమై రాష్ట్రంలో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు పిలుపునిచ్చారు.సనత్‌నగర అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి స్వామి థియేటర్ వద్ద ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రాధాకృష్ణ, పవన్, ధర్మేంద్ర, సంతోష్, సురేష్, మల్లిబాబు పాల్గొన్నారు.



తనకు ఓటేయాలని కోరుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న జలంధర్‌గౌడ్

రాంగోపాల్‌పేట్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తప్పక వినియోగించుకోవాలని మక్తల ఫౌండేషన్ అధ్యక్షులు జలంధర్‌గౌడ్ సూచించారు. సోమవారం ఆయన ఫౌండేషన్ సభ్యులతో కలిసి సనత్‌నగర్ నియోజకవర్గంలోని కళాసీగూడ, సోమసుందరంవీధి, జనరల్‌బజార్ తదితర ప్రాంతాల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుతో పాటు మంచి పాలకుడిని మనమే ఎన్నుకునేందుకు కల్పించిన బాధ్యత అన్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో అందరూ ఓటు వినియోగించుకోవడం మూలంగా మనల్ని పాలించేందుకు మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. ఓటు హక్కు వినియోగించుకోలేకపోతే మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి వచ్చిన అవకాశాన్ని కోల్పోతామని సూచించారు. ద్విచక్ర వాహనానికి బోర్డులు ఏర్పాటు చేసి మైకుద్వారా, ప్రత్యేకంగా ఒక్కొక్కరిని కలిసి జలంధర్‌గౌడ్ ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రవణ్, గణేష్ గౌడ్, పూర్ణ చందర్, శ్రీనివాస్, సాయిబాబా పాల్గొన్నారు.

మేకల సారంగపాణికే మా మద్దతు : ముదిరాజ్ సంఘం



సారంగపాణికి మద్దతు తెలుపుతున్న ముదిరాజ్ నాయకులు

బౌద్ధనగర్: సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణికే తమ సంఘం మద్దతు ఉంటుందని ముదిరాజ్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు కనకయ్య ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం సంఘం సభ్యులంతా మేకల సారంగపాణిని కలిసి మద్దతు ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. న్యూ అశోక్‌నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమానికి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ హాజరయ్యారనీ కార్యక్రమంలో ఉన్న ముదిరాజ్‌లకు బలవంతంగా బీఆర్ఎస్ పార్టీ కండువాలు వేశారన్నారు. తాము బీఆర్ఎస్‌లో చేరినట్లు సామాజిక మాధ్యమాలు, వివిధ పత్రికల్లో ప్రచురించారని అవన్నీ అబద్ధపు ప్రచారాలన్నారు. అశోక్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరలేదని, తామంతా సారంగపాణికే మద్దతు తెలుపుతున్నామన్నారు.

నేడే ఆఖరు.. ర్యాలీల జోరు!

సనత్‌నగర్: ఎన్నికల ప్రచారం తుది ఘట్టానికి చేరుకుంది. మరికొన్ని గంటల్లో గడువు ముగిస్తుండడంతో మంగళవారం అన్ని ప్రధాన పార్టీలు ర్యాలీలకు సిద్ధమయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆ పార్టీ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పద్మారావునగర్ ను ంచి ప్రారంభమయ్యే ర్యాలీ ఐడీహెచ్‌కాలనీ, జబ్బార్ కాంప్లెక్స్, మోండా, గాంధీ ఆస్పత్రి, షోలాపూర్ స్వీట్స్, మహంకాళి దేవాలయం, కళాసీగూడ, రాణిగంజ్, బేగంపేట, పాటిగడ్డ, ఎన్‌బీటీనగర్, ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, బల్కంపేటల మీదుగా సనత్‌నగర్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా బైక్ ర్యాలీ జరపనున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జెక్‌కాలనీ నుంచి ప్రారంభమై సనత్‌నగర్ బస్టాప్, ఎస్ఆర్‌టీ, స్వామి టాకీస్, 60 ఫీట్ రోడ్డు, ఎల్లమ్మ టెంపుల్, డీకేరోడ్డు, అమీర్‌పేట గ్రీన్ పార్కు రోడ్డు, బ్రాహ్మణవాడీ, ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ, మోతీలాల్‌నెహ్రూనగర్, ప్రకాష్‌నగర్ వాటర్‌వర్క్స్, పాటిగడ్డ, మినిస్టర్ రోడ్డు, పీజీ రోడ్డు, ప్యారడైజ్, స్వప్నలోక్ కాంప్లెక్స్, ప్యాట్నీ సెంటర్, అంజలి టాకీస్, సిటీలైట్ హోటల్, బైబిల్ హౌస్, బన్సీలాల్‌పేట, గొల్లకొమురయ్య బస్తీ, ఫ్లోరా హోటల్, పద్మారావునగర్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

కంటోన్మెంట్‌లో ఎగిరేది గులాబీ జెండానే



ప్రచారం చేస్తున్న లాస్య నందిత

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఢిల్లీ పార్టీలకు ఓటమి తప్పదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత స్పష్టం చేశారు. ప్రజలందరి ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్సే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించే సత్తా ఒక్క కేసీఆర్ కే ఉందన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే ఢిల్లీ పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. తెలంగాణ, కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్తున్న బీఆర్ఎస్‌నే మరోసారి గెలిపించుకోవాలన్నారు. బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్‌తో కలిసి కాంటాబస్తీలో ఇంటింటికీ వెళ్లి తనకు గెలిపించాలని కోరారు.

బీజేపీ గెలుపు ఖాయం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సదానంద్ తన్వాడే

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ గోవా అధ్యక్షులు, ఎంపీ సదానంద్ తన్వాడే అన్నారు. ఆరోవార్డు టెంపుల్ రాక్ ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు కంటోన్మెంట్ అభ్యర్థి శ్రీగణేశ్‌తో పాటు బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, జంపన ప్రతాప్, బోర్డు సభ్యుడు రామకృష్ణతో ప్రత్యేకంగా సమావేశమై ఎన్నికల వ్యూహంపై చర్చించారు. కంటోన్మెంట్‌లోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం బీజేపీతోనే సాధ్యం అవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బీజేపీకి చెందిన వ్యక్తి ఉంటే కేంద్రంతో సమన్వయం సులువు అవుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణకు త్వరలోనే పరిష్కారం



ప్రచారంలో పాల్గొన్న యూపీ ఎంపీ మిథిలేష్ కుమార్

కంటోన్మెంట్: ఎస్సీ వర్గీకరణ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తోందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎంపీ, మాజీ మంత్రి మిథిలేష్ కుమార్ తెలిపారు. కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్‌కు మద్దతుగా ఆరోవార్డు భావనా కాలనీలో నిర్వహించిన ప్రచారానికి ఆయన హాజరై మాట్లాడారు. కంటోన్మెంట్ ఉద్యోగుల ఇళ్ల పట్టాలకు సంబంధించిన 25 ఎకరాల భూమి కేటాయింపు అంశాన్ని తాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కేంద్రం పరిధిలోకి వచ్చే కంటోన్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్ ఎమ్మెల్యేగా గెలిస్తే అభివృద్ధి రెట్టింపు అవుతుందన్నారు. ప్రచారంలో భానుక మల్లికార్జున్, భానుక నర్మద, అజిత్ కళ్యాణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే బీఆర్ఎస్ సభ రద్దు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: ఓటమి భయంతోనే పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని ప్రకటించిన సభను బీఆర్ఎస్ రద్దు చేసుకుందని బీజేపీ నేత, కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. స్థానికంగా వసూలయ్యే పన్నులు, కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులతోనే అభివృద్ధి కొనసాగుతోందన్నారు. బడులు, గుడులకు నిధులు, శ్మశానాల అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. తొమ్మిదేళ్లుగా కేంద్రంలో అవినీతి మరకలేని పాలనను బీజేపీ అందిస్తోందన్నారు. 2018లో ఓటమి పాలైనప్పటికీ ప్రజల మధ్యే ఉంటూ వచ్చిన బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లను నమ్మొద్దు



లాస్యకు మద్దతు తెలుపుతున్న మాల మాదిగలు

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణ విషయంలో దగా చేసిన బీజేపీ ప్రభుత్వం మాదిగల ఓటు బ్యాంకు దండుకునేందుకు తూతూ మంత్రంగా కమిటీ వేసిందని ఈ విషయాన్ని మాదిగలు గుర్తుంచుకుని దళితుల అభ్యున్నతికి కృషిచేస్తున్న బీఆర్ఎస్‌కు ఓటేయాలని మాదిగ జేఏసీ నాయకులు జేరిపోతుల మాదిగ పిలుపునిచ్చారు. ఈద్గా అంబేడ్కర్ నగర్‌లో బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్ సమక్షంలో మాల మాదిగలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీజేపీ కాంగ్రెస్ తెరవెనుక కుట్రలు పన్నుతున్నాయని ఆ రెండు పార్టీలను నమ్మొద్దని సాయి అన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి మాల మాదిగ ఐక్యతను చాటాలని కోరారు. సన్నీ, దబ్బేట శ్రీను, సాయికిరణ్, జగదీష్ పెద్దరాజు, సురేష్, పూజ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

- లాస్యనందితకు మద్దతుగా ఆమె సోదరి నమ్రత, పార్టీ ఇన్‌చార్జి ఎంఎన్. శ్రీనివాస్, సీనియర్ నాయకులు కట్టెల శ్రీనివాస్ యాదవ్‌లు రసూల్‌పురా కట్టమైసమ్మ బస్తీలో బహిరంగ సభ నిర్వహించారు. రెండుసార్లు ప్రజల మద్దతుతో అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని మరో సారి అవకాశం ఇస్తే మరింతా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు టిఎన్. శ్రీనివాస్. డి. శ్రీనివాస్. అంజనేయులు, కుమార్, నరేష్, జిలానీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం



అడ్డగుట్ట: కాంగ్రెస్‌ను గెలిపించటం బీఆర్ఎస్‌ను ఓడించడమే తమ లక్ష్యమని అడ్డగుట్ట వ్యవస్థాపకులు ఎస్. యాదగిరి పేర్కొన్నారు. బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి, అడ్డగుట్ట వ్యవస్థాపకులు ఎస్. యాదగిరి సోమవారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా ఆయనకు రేవంత్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. యాదగిరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం పదేళ్ల వెనుకకు వెళ్లిందన్నారు. నియంతృత్వం, ని రుద్యోగం, పెరిగిపోయా యని రాష్ట్ర ప్రజల కోసం కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే, కేవలం తన కుటుంబ స్వలాభం కోసమే కేసీఆర్ వాడుకున్నారన్నారు. ప్రజాస్వామ్య మనుగడకై కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యా రెంటీలు కచ్చితంగా అమ లు అవుతాయన్నారు. అరు ణ, సునీత, లలిత, స్వరూప, లక్ష్మి, సంతోషి, సాలమ్మ, సుచరిత, చిన్న, యాదగిరి, రాజయ్య కాంగ్రెస్‌లో చేరారు.